# మనం కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

మంగళవారం | 20 | అక్టోబర్ | 2026 | పేజీలు 8 | www.manamepaper.com




# అధర్మంపై ధర్మం సాధించిన అఖండ విజయం దసరా..!

### నేడు విజయదశమి..చెడుపై మంచి సాధించిన 'విజయం'

దసరా (విజయదశమి) అనేది అధర్మంపై ధర్మం సాధించిన అఖండ విజయానికి ప్రతీకగా జరుపుకునే అత్యంత ప్రాముఖ్యమైన హిందువుల పండుగ. ఈ సందర్భంగా విజయ దశమి పండుగ వేడుకలు గంగాధర మండలంలోని ప్రజలు నేడు ఘనంగా నిర్వహించనున్నారు.

**గంగాధర, అక్టోబర్ 19, ( మనం న్యూస్ ) :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ దసరా పండుగను జరుపుకోనున్నారు. ఉదయాన్నే లేచి కొత్త బట్టలు ధరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆయుధ పూజ, వాహనాలకు పూజలు చేసి, ఊరూవాడ ముస్తాబై శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజ అనంతరం జమ్మి ఆకులను స్నేహితులు ఒకరికి ఒకరు ఇచ్చి పుచ్చుకొని ఆలింగనం చేసుకొని దసరా పండగ..

- మిగతా 2వ పేజీలో..

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ అక్టోబర్ 19(మనం బ్యూరో ) :** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులతో కలిసి ప్రజల నుంచి 44 అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 19 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సోమవారం కల్లా శాఖల లాగిన్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే సోమవారం నుంచి మొదటి గంటలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని.. ఈ లోగా అధికారులు లాగిన్ లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సూపరింటెశీడెంట్లు కాళీ చరణ్, మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చెన్నూర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

### రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి 70 షాపులు

### పుష్కరాల పనులకు రూ.6 కోట్లు..

### శివాలయ అభివృద్ధికి రూ.17 కోట్లతో ప్రతిపాదన

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**చెన్నూరు అక్టోబర్ 19 (మనం న్యూస్) :** చెన్నూర్ పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డులో అధికారులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

- మిగతా 2వ పేజీలో..

## విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు



చిగురుమామిడి అక్టోబర్ 19 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని మంత్రి పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో దసరా పండుగను జరుపుకోవాలని, ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో అభివృద్ధి, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## ఖానాపూర్ గ్రామంలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం

మంథని అక్టోబర్19 (మనం న్యూస్) మంథని మండలం ఖానాపూర్ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఆదివారం ఖానాపూర్ గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను గ్రామ సర్పంచ్ సంగెం- అరుణ గట్టయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సర్పంచ్ అరుణ గట్టయ్య మాట్లాడుతూ ఖానాపూర్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో, శ్రీనుబాబు ఆదేశాల మేరకు,బాలవికాస సంస్థ ద్వారా ఖానాపూర్ గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. గ్రామంలో 70 మంది సభ్యులు మాత్రమే సభ్యత్వం తీసుకున్నప్పటికీ, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో కమిటీ సభ్యులు పర్వవేన మల్లయ్య,బిరుదు సమ్మయ్య,బాస శంకర్ తమ వంతు సహకారం అందించి వాటర్ ప్లాంట్ ప్రారంభానికి కృషి చేశారన్నారు.గ్రామ ప్రజల సౌకర్యార్థం కనగంటి శ్రీవాత్సవతమ వంతు సహాయంగా 80 వాటర్ క్యాన్లను అందించారన్నారు.గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి సహకరించిన వారికి సర్పంచ్ అరుణ-గట్టయ్య హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో పాటు,ఖానాపూర్ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## అధర్మంపై ధర్మం సాధించిన అఖండ విజయం... దసరా..!

( మొదటి పేజీ తరువాయి )

శుభాకాంక్షలు తెలుపుకుంటారు.పెద్దలకు జమ్మి ఆకును ఇచ్చి ఆశీర్వాదాలు పొందుతారు.సాయంత్రం గ్రామ శివారులలో పాలపిట్టను దర్శించుకుని, రాత్రి ఆయా గ్రామాల్లోని మైదానంలో రావణ దహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**విజయదశమి విశిష్టత**

లోకకంటకుడైన మహిషాసురుడనే రాక్షసుడిని అంతం చేయడానికి దేవతలందరి శక్తులతో అవతరించిన దుర్గాదేవి, తొమ్మిది రాత్రులు హోరాహోరీగా యుద్ధం చేసి పదో రోజున అతడిని వధించింది. అందుకే దీనిని 'విజయదశమి' అంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు భక్తులు శరన్నవరాత్రులుగా, పదో రోజున 'విజయదశమి'గా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. దసరా నవరాత్రులు కేవలం వేడుకలు మాత్రమే కాదు, ఇవి మానవుని లోని అంతర్గత శక్తులను మేల్కొలిపే సాధన. తొమ్మిది రోజులు దుర్గాదేవిని వివిధ రూపాల్లో (బాలాత్రిపుర సుందరి, లలితా దేవి, సరస్వతి, మహిషాసురమర్దిని వంటి అలంకారాల్లో) పూజిస్తారు. మానవునిలో ఉండే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే దుర్గుణాలను (రాక్షస ప్రవృత్తిని) జయించి, సద్గుణాలను పెంచుకోవాలనే అంతర్గత సందేశాన్ని ఈ పండుగ ఇస్తుంది.

**జమ్మి చెట్టు పూజ :**

ద్వాపరయుగంలో పాండవులు తమ అజ్ఞాతవాసాన్ని ముగించుకుని, జమ్మి చెట్టు (శమీ వృక్షం) పై దాచిన ఆయుధాలను తిరిగి తీసి, కౌరవులపై విజయ పరంపరను ప్రారంభించిన రోజుగా భావించి, దసరా రోజు సాయంత్రం భక్తులు శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ అని శ్లోకాలు పఠిస్తూ జమ్మి చెట్టుకు పూజ చేసి, ఆ ఆకులను (బంగారంగా భావించి) పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు. ఇది సమాజంలో పరస్పర బంధాలను, ప్రేమాభిమానాలను పెంపొందించడంతో పాటు ప్రతి పనిలోనూ విజయం సాధిస్తామని నమ్మకం.

**పాలపిట్ట దర్శనం :**

పాలపిట్టను పరమేశ్వరుడి (శివుడు) అవతారంగా లేదా ఆయన ప్రతిరూపంగా భక్తులు భావిస్తారు. సముద్ర మథనం సమయంలో లోక రక్షణ కోసం హాలాహలాన్ని మింగి, గొంతులో నిలుపుకోవడం వల్ల శివుడు 'నీలకంఠుడు' అయ్యాడు. పాలపిట్ట గొంతు భాగం కూడా నీలి రంగులో ఉండటం వల్ల దీనిని 'నీలకంఠ పక్షి' అని పిలుస్తూ, దీనిని దర్శిస్తే సాక్షాత్తు శివుడిని దర్శించినంత పుణ్యం లభిస్తుందని, దసరా రోజున ఈ పక్షిని చూడటం వల్ల ఏడాది పొడవునా చేపట్టే ప్రతి పనిలోనూ విజయం (కార్యసిద్ధి) లభిస్తుందని, అదృష్టం కలిసివస్తుందని ప్రజల బలమైన నమ్మకం. పాలపిట్ట దర్శనం వల్ల అంతర్గత దోషాలు, జాతక దోషాలు తొలగిపోయి ప్రశాంతత లభిస్తుందని విశ్వసిస్తారు.

## చెన్నూర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

( మొదటి పేజీ తరువాయి )

**బైపాస్ రహదారి నిర్మాణంపై పరిశీలన**

చెన్నూర్‌లో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా 70 షాపులు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్లాట్ల వారీగా కేటాయింపు ప్రక్రియ నిర్వహించి మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేయాలన్నారు.పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడంతోపాటు లారీల రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రూ.1.60 కోట్లతో బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, మార్కెట్లు, ఇతర మౌలిక సదు-పాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామన్నారు.

**పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాల సందర్భంగా అభివృద్ధి పనులు, అవసరమైన ఏర్పాట్ల కోసం రూ.6 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. చెన్నూర్‌లోని శివాలయ అభివృద్ధికి రూ.17 కోట్లతో పనులు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ డ్రైనేజీలు నిర్మించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. నాన్‌వెజ్ మార్కెట్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని, ముదిరాజ్, మైనారిటీ, గౌడ తదితర వర్గాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాల**

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. సోమనపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు రూ.200 కోట్లతో పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం అందించే పథకం అమలవుతోందని చెప్పారు. పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు చదువుపై ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

**100 పడకల ఆసుపత్రి పరిశీలన**

అనంతరం చెన్నూర్‌లోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి సందర్శించారు. క్యాజువాలిటీ విభాగం, అత్యవసర వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. సిబ్బంది హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష నిర్వహించి రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు అవసరమైన పరికరాల వివరాలను తెలుసుకుని వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించి రోగులు, వారి సహాయకులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

**ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం**

పట్టణంలోని మధన పోచమ్మ ఆలయాన్ని సందర్శించిన మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నూతన కమిటీ చైర్‌పర్సన్ సతీష్‌తో పాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్మన్ వినయ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్‌రావు, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ సత్యనారాయణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అప్పు డబ్బుల వివాదం

## యువకుడిపై బటన్ కత్తితో దాడి...

### ఐదుగురు అరెస్ట్...

జమ్మికుంట, అక్టోబర్ 19 (మనం న్యూస్): అప్పు డబ్బుల వివాదం నేపథ్యంలో యువకుడిపై బటన్ కత్తితో దాడి చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను జమ్మికుంట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. నిందితుల నుంచి బటన్ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... వీణవంక మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన ఎట్టపు మహేష్ గత ఏడేళ్లుగా జమ్మికుంట బస్టాండ్ సమీపంలో రిషి మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. సుమారు ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన చిన్నాల రమేష్ వద్ద రూ.5 లక్షలు వడ్డీకి అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులను తిరిగి చెల్లించాలని రమేష్ పలుమార్లు అడిగినప్పటికీ చెల్లించకపోవడంతో వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో అక్టోబర్ 17న సాయంత్రం జమ్మికుంట బస్టాండ్ సమీపంలోని మొబైల్ షాప్ వద్ద చిన్నాల రమేష్, ఎట్టపు మహేష్ మధ్య అప్పు డబ్బుల విషయమై వాగ్వాదం జరిగింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన రమేష్ తమ్ముడు చిన్నాల అనిల్ పై ఎట్టపు మహేష్ తో పాటు మాకోటి శ్రీకాంత్, కోరపల్లి సాయి అలియాస్ నాంపల్లి సాయి కుమార్, పల్లవేన రాజు, నరెంగుల మహేష్ అలియాస్ మహిపాల్ కలిసి దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో బటన్ కత్తితో అనిల్ మెడపై బలమైన గాయం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి బటన్ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండు తరలించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిందితులపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.



# వెళ్లి రావమ్మా గౌరమ్మా.. మళ్లీ రావమ్మా!



బుగ్గారం, అక్టోబర్ 19 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తుది ఘట్టానికి చేరుకుంది. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు, చిన్నారులు చేరి ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయ పాటలు ఆలపిస్తూ కోలాటాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

**పూల సోయగాల నడుమ సంబరాలు**

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి పూజలు నిర్వహించారు. 'ఒక్కేసి పువ్వేసి చందమామ.. చిత్తు చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మా' అంటూ మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటూ ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం బతుకమ్మలను సమీప కాలువలో నిమజ్జనం చేసి గౌరమ్మకు వీడ్కోలు పలికారు.

**తొమ్మిది రోజుల పూల పండుగకు ముగింపు**

తొమ్మిది రోజులపాటు సాగిన బతుకమ్మ సంబరాలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి, వాటిని వరుసలుగా పేర్చి బతుకమ్మను రూపొందించడం ఈ పండుగ ప్రత్యేకత. మహిళలు గౌరమ్మకు పూజలు చేసి, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక**

బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, ప్రకృతితో మనిషికి ఉన్న సంబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ పాటలు, పూలతో పేర్చే సంప్రదాయాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సద్దుల బతుకమ్మతో ఈ ఏడాది వేడుకలకు ముగింపు పలికిన మహిళలు.. వచ్చే ఏడాది మళ్లీ గౌరమ్మ రావాలని ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలికారు.

# మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



బెల్లంపల్లి అక్టోబర్ 19 (మనం న్యూస్) : బెల్లంపల్లి పట్టణంలోని బాబు క్యాంపు బస్తీలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు తొమ్మిదవ రోజు ప్రత్యేకించి శ్రీరామ్ పట్ల కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో 9 మంది చిన్నారులకు సుహాసిని నవ కన్యక పూజ నిర్వహించారు ఈ సందర్భంగా పండితులు కార్తీక్ శర్మ గారు మాట్లాడుతూ మన హిందూ సంస్కృతిలో సాంప్రదాయంలో ఆడపిల్లను చిన్నపిల్లను దేవి దేవతలుగా స్వరూపాలుగా సాక్షాత్తు అమ్మవారి రూపాలుగా భావించి ప్రత్యేకించి 9 అవతారాలు రూపంలో కన్యకా పరమేశ్వరి బాలా త్రిపుర సుందరి. అన్నపూర్ణ గాయత్రీ దేవి లలితా త్రిపుర సుందరి సరస్వతి దేవి మహాలక్ష్మి దుర్గాదేవి మహిషాసుర మర్దిని అవతారాలుగా పిల్లలకు పూజలు చేశారు అనంతరం సామూహిక మహా మంగళహారతి మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది చిన్నారులు సాయి శృతిక పుల్లూరి చరణీ సహస్ర రుతిక శ్రీనిధి రిషికా హన్విత పుల్లూరు శ్రీనిధి అది త్రి చిన్నారులు పాల్గొన్నారు

# మన్నెగూడం పల్లగుట్ట దేవాలయాల నిర్మాణానికి రూ.2.16 లక్షల విరాళం

మేడిపల్లి, భీమారం అక్టోబర్ 19 (మనం న్యూస్): ఉమ్మడి మేడిపల్లి, భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామ పరిధిలో ఉన్న పల్లగుట్టపై నిర్మాణంలో ఉన్న దేవాలయాలకు విరాళాల పరంపర కొనసాగుతోంది. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన మామిడి గోవర్ధన్ (తండ్రి వెంకటి) సోమవారం ఆలయాల నిర్మాణం కోసం రూ.2 లక్షల 16 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని పల్లగుట్ట దేవాలయాల కమిటీ సభ్యులకు అందించి, ఆలయాల నిర్మాణానికి తనవంతు సహకారం ప్రకటించారు. దేవాలయాల నిర్మాణానికి గ్రామస్థులు, భక్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందిస్తుండటంపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందిస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్న దాతలను గ్రామస్థులు అభినందించారు. పల్లగుట్టపై దేవాలయాల నిర్మాణం పూర్తయితే భీమారం మండలంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందడంతో పాటు, భక్తులను ఆకర్షించే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందే అవకాశం ఉందని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేందుకు భక్తులు, దాతలు, గ్రామస్థులు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నమనేని సత్యారావు, కొండ కిషన్ గౌడ్, తేలు నరేష్, హన్మండ్ల సతీష్ పాల్గొన్నారు.



# నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడి, మహిళా గ్రూప్ భవన నిర్మాణాలకు రూ.14 కోట్ల 76 లక్షల నిధులు మంజూరు

**-మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజాప్రతినిధులు, మహిళ ప్రతినిధులు...**

మంథని అక్టోబర్19 (మనం న్యూస్) పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని పలు మండలాలకు నూతనగ్రామపంచాయతీ, అంగన్వాడి, మహిళా గ్రూప్ భవన నిర్మాణాలకు గాను రూ 14 కోట్ల 76 లక్షల నిధులు విబిజిఆర్‌ఏ ఎంజి కింద నిధులు మంజూరైనవి. మంథని నియోజకవర్గం లోని మంథని ముత్తారం రామగిరి పాలకుర్తి కమాన్ పూర్ మండలాలలోని పలు గ్రామాలకు అంగన్వాడి, గ్రామపంచాయతీ, మహిళా భవనాల నిర్మాణాలకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు నిధులను మంజూరు చేపించారు. ఈ మండలాలకు రూ 14 కోట్ల పెబ్బేరు లక్షల నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు మంథని డివిజన్ లోని సర్పంచులు, మహిళా సంఘం ప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# దసర పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం




బెల్లంపల్లి, అక్టోబర్ 19, (మనం న్యూస్ ) : దసరా పండగ పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి కమిటీ , షాద్ నగర్ కమిటీ, హైదరాబాద్ కమిటీ, కొత్తకోట కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను బెల్లంపల్లి మండలంలోని అంకుశం, కన్నాల, బోయపల్లి, చౌటపల్లి, లింగదరి గూడెం గ్రామాల్లో సోమవారం ప్రచార వాహనం ద్వారా త్రైత సిద్ధాంత భగవద్గీత , ఆధ్యాత్మిక గ్రంథముల ఇంటింటా ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరమే భగవద్గీత లో ముఖ్య మైన జ్ఞానం అని తెలిపారు. దశ అంటే పది అని , 'ర' అంటే నశింప జేయడం అని అర్థం ఐదు కర్మేంద్రియాలను, ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింప జేయడం అంటే మొత్తం పది ఇంద్రియాలను జయించడమే దశరా పండుగ యొక్క అర్థం అని, అందరూ తెలుసుకోవాలని గురువు గ్రంథాలలో వ్రాశారని తెలిపారు. ఈ కార్యక్రమం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి కమిటీ , షాద్ నగర్ కమిటీ, హైదరాబాద్ కమిటీ, కొత్తకోట కమిటీ సభ్యులు, దేవేందర్, సద్గుణ, అశోక్, లత, భాస్కర్ , రాజేశ్వరి, జయమ్మ, కవిత, లావణ్య, లక్ష్మీ నారాయణ, లింగస్వామి, ప్రథమ్, సామ్రాట్ పాల్గొన్నారు.

# అండర్ 17 వాలీబాల్ పోటీలు

బెల్లంపల్లి, అక్టోబర్ 19, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి మండలం తాళ్ల గురిజాల గ్రామంలో సోమవారం ఈరోజు తాళ్ల గురజాల గ్రామంలో ఖేలో ఇండియా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అండర్ 17 బాల బాలికలు వాలీబాల్ ఎంపిక పోటీలు పోలీసుల సహకారంతో నిర్వహించారు. ఈసందర్భంగా వంగ రాములు మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో నైపుణ్యం ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఈ వాలీబాల్ పోటీల్లో ఎంపిక చేస్తామని అన్నారు. క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని వివరించారు. క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ వాలీబాల్ క్రీడాకారులు ఏసిసి రవి, తాళ్ల గుర్జాల ఎస్సై ప్రశాంత్, తాళ్ల గురజాల సర్పంచ్ వంగ రాములు, చంద్రవెల్లి సర్పంచ్ శ్రీనివాస్, తాళ్ల గురజాల ఉప సర్పంచ్ దాకూరి సురేష్, వార్డు సభ్యులు వెంకటేష్, కోటయ్య, సీనియర్ క్రీడాకారులు ముస్తఫా, రమేష్, రషీద్, నరేష్, సందీప్, కేశవ, రాహుల్, సాయికుమార్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




# బంగారం షాపులో భారీ అగ్నిప్రమాదం

జమ్మికుంట, అక్టోబర్ 19 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా సమీపంలోని శ్రీ విజయలక్ష్మి బంగారం దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షాపు యజమాని మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దుకాణంలోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే బంగారం దుకాణంలోని ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదయ్యింది. సమీపంలోని దుకాణ యజమానులతో పాటు అగ్నిమాపక సిబ్బంది బంగారం దుకాణంలోని విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చారు. దీంతో మరింత నష్టం జరగకుండా కొంతమేర నివారించగలిగారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తోనే అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు.




# జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కు ఘన సత్కారం

జమ్మికుంట, అక్టోబర్ 19 (మనం న్యూస్):జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మలిశెట్టి కుమార్ సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా జాతీయస్థాయిలో 2026 విజయదశమి పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీ గీతమేశ్వర సాహితీ కళాసేవ సంస్థ 6వ వార్షికోత్సవ సందర్భంగా అధ్యక్షులు దూదపాక శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ ను సంగీత నాట్య కళావేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కు స్వర్ణకంకణం ధరింపజేసి పురస్కార పత్రం( మెమెంటో) అందజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాహితీ రంగంలో చేసిన కృషిని కొనియాడారు.



# మొగిలిపేట దుర్గమ్మ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించిన యం.డి మహబుబ్ ఖాన్

మల్లాపూర్ అక్టోబర్, 19(మనం న్యూస్ ) మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామమం-ంలోని సోమవారం రోజున యం.డి మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో దుర్గ మాల ధరించిన భక్తులకు అన్నదా న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యం.డి మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ అమ్మవారి దయ అందరి పై ఉండి గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉ ండాలని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి అనంతరం అన్నధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ ఎనడ్ల రాములు, మండల కాంగ్రెస్ పార్టీ బి.సి సెల్ అధ్యక్షులు వర్ధ సురేష్, వార్డ్ సభ్యులు విజయ్ నేత, తిప్పని మునిందర్, భక్తులు పాల్గొన్నారు.



# బతుకమ్మ నిమజ్జనం వద్ద... విద్యుత్ వైర్లు, ఎల్ఈడీ, ఐమాక్స్ బల్బు చోరీ..!



గంగాధర, అక్టోబర్ 19, ( మనం న్యూస్ ):గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా ఇటీవల బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు, ఎల్ఈడీ లైట్లు, ఒక ఐమాక్స్ బల్బును గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో దొంగిలించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఊరి చివరి నుండి సమీపంలోని వాగువద్ద గల ఎల్లమ్మ గుడివరకు మహిళలు బతుకమ్మ ఆడుకొని నిమజ్జనం చేసుకునేందుకు సర్పంచ్ గునుగొండ యశోద బాబు ఆధ్వర్యంలో విద్యుత్ వైర్లు, ఎల్ఈడీ లైట్లు, ఐమాక్స్ బల్బును ఏర్పాటు చేశారు. ఆదివారం బతుకమ్మల నిమజ్జనం అనంతరం దొంగతనం జరిగినట్లు పేర్కొన్నారు. పండుగ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సామగ్రితో పాటు వైర్ కూడా దొంగిలించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామ సమీపంలోని నీటి కాలువ వద్ద మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు సైతం చోరీకి గురవుతున్న ఘటనలు చోటు చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. వరుసగా ఇలాంటి చోరీలు జరుగుతుండటంతో గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. దొంగిలించిన లైట్ల సామాగ్రి దాదాపు 20వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. బతుకమ్మ పండుగ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సామగ్రిని, రైతుల మోటార్లకు సంబంధించిన వైర్లను దొంగిలించడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు ఈ ఘటనలపై దృష్టి సారించి, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాత్రి వేళల్లో నిఘా పెంచి, విద్యుత్ సామగ్రికి భద్రత కల్పించాలని నాగిరెడ్డిపూర్ గ్రామ-స్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏపీపీ ఉద్యోగం సాధించిన శ్రీకాంత్‌కు ఘన సన్మానం



గంగాధర, అక్టోబర్ 19, ( మనం న్యూస్ ) : గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన లంకదాసరి శ్రీకాంత్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగం సాధించగా గ్రామ సర్పంచ్ ముద్దం నగేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు దోమకొండ మహేష్, నాయకులు ఆళ్ల విజేందర్ రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నగేష్ మాట్లాడుతూ శ్రీకాంత్ ఇటీవల వెలువడిన టిఎస్ ఎల్ పిఆర్ బి ఫలితాల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగాన్ని సాధించడం గ్రామానికి గర్వకారణం అన్నారు. శ్రీకాంత్ విజయ ప్రస్థానంలో ఎన్నో కష్టాలు, సవాళ్లు ఎదురైనా, 2025లో గౌరవ హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో కేవలం 3 మార్కుల తేడాతో న్యాయమూర్తి ఉద్యోగాన్ని సాధించే అవకాశాన్ని కోల్పోయినప్పటికీ, ఆయన నిరాశ చెందకుండా, ఆ అనుభవాన్ని పాఠంగా తీసుకొని మరింత పట్టుదలతో చదివి, నిరంతర కృషితో ఉద్యోగాన్ని సాధించారని పేర్కొన్నారు. ఒక అవకాశం చేజారినా లక్ష్యాన్ని వదులుకోకుండా, కష్టపడి తన కలను సాకారం చేసుకున్న శ్రీకాంత్ ప్రయాణం ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని, గ్రామ యువత శ్రీకాంత్ ను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి, పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కోరారు. యువత తమ లక్ష్యాల సాధనలో ఎదురయ్యే అడ్డంకులకు నిరాశ చెందకుండా, నిరంతర కృషితో ముందుకు సాగి తమ కుటుంబాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. శ్రీకాంత్ విజయం ఆయన వ్యక్తిగత విజయమే కాదు... మన గ్రామ యువతలో కొత్త ఆశలు నింపే స్ఫూర్తిదాయక మైన విజయమని కొనియాడారు. శ్రీకాంత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# అనారోగ్యంతో భార్యను కోల్పోయిన కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ సాయం



రామగిరి,అక్టోబర్ 19 (మనం న్యూస్): ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో రామగిరి మండలం పన్నూర్ గ్రామానికి చెందిన చిందం శంకర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కు మంజూరైంది. పన్నూర్ గ్రామానికి చెందిన చిందం శంకర్ భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆసుపత్రి ఖర్చులు, కుటుంబ ఆర్థిక పరిస్థితిని పన్నూర్, రామగిరి మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సహకారంతో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు చేయించి అందజేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి ప్రజల కష్టాల్లో తోడుగా నిలుస్తూ, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన బాధిత కుటుంబాలకు సహాయం అందించడం అభినందనీయమని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబుకు, ఈ సహాయానికి కృషి చేసిన మంత్రి కార్యాలయ సిబ్బందికి, పన్నూర్, రామగిరి మండల కాంగ్రెస్ నాయకులకు చిందం శంకర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాత కక్షలతో నిండు ప్రాణం బలి

వెల్గటూర్, అక్టోబర్ 19(మనం న్యూస్): రెండు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షతో పండగ వేల ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటన ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బొంతు మల్లయ్య ఉపాధి నిమిత్తం పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలో నివాసం ఉంటున్నారని, శివరాత్రి మల్లేష్, బొంతు మల్లయ్య కుటుంబాల మధ్య ఉన్న అక్రమ సంబంధాల వ్యవహారం కారణంగా రెండు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరిగేవని అదే నేపథ్యంలో వారి కుమారుడు బొంతు సంతోష్ (17) ఎండపల్లి మండలం రాజారాం పల్లి పాత గూడూరు చౌరస్తా వద్ద ఉన్నాడని తెలుసుకొని శివరాత్రి మల్లేష్ అతని కుమారుడు అనిల్ కుమార్ లు సంతోష్ పై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలు చేయగా రక్తస్రావంతో ఉన్న సంతోష్ ను స్థానికులు హుటాహుటిన అంబులెన్స్ సహాయంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అప్పటికే సంతోష్ మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు

# తాడికల్‌లో కుంకుమ పూజ



శంకరపట్నం అక్టోబర్ 19 (మనం న్యూస్) : శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో దుర్గ మాత వద్ద కుంకుమ పూజను మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు,ఈ కార్యక్రమంలో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలి

చిగురుమామిడి, అక్టోబర్ 19: మనం న్యూస్ : చిగురుమామిడి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి చత్రు నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు, ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. మండల వ్యవసాయ అధికారి టి. పున్నం చందర్ మాట్లాడుతూ రైతులు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, సందేహాలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి పాక్స్ చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, ఏఈవో ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



## బూజునూర్ చెరువు వద్ద ఘనంగా బతుకమ్మ వేడుకలు



ఇల్లందకుంట, అక్టోబర్ 19 (మనం న్యూస్): ఇల్లందకుంట మండలం బూజునూర్ గ్రామంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలోని చెరువు వద్ద మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు అనువుగా ఉండేలా చెరువు సమీపంలోని మట్టి స్థలాన్ని జేసీబీ సహాయంతో శుభ్రం చేయించి, బతుకమ్మ ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్ణయం మేరకు బతుకమ్మ ప్రాంగణంలో సుమారు 432 మీటర్ల విస్తీర్ణంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ చర్లపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ పనుల కోసం సుమారు రూ.14 లక్షలు ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళలు, గ్రామ ప్రజలు బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు లైటింగ్, డిజె సాంగ్స్, త్రాగునీరు, అవసరమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచి శ్రీనివాస్ తెలిపారు.

## దసరా పండుగ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



హుజురాబాద్, అక్టోబర్ 19 (మనం న్యూస్): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్ లో చేస్తున్న ఏర్పాట్లను సోమవారం సాయంత్రం హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవ ప్రాంగణంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరిగేలా మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ తరఫున తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్, సీఐ కరుణాకర్, కౌన్సిలర్స్, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరిపెల్లిలో ఘనంగా శ్రీరామ హృదయ కలశ యాత్ర

రాయికల్, అక్టోబర్ 19(మనం న్యూస్) : రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి లో గ్రామపంచాయతీ వద్ద శ్రీ దుర్గానవరాత్రి ఉత్సవాలలో తొమ్మిదవ రోజు సోమవారం శ్రీరామ హృదయ కలశ యాత్ర వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, వేద పండితులు మరింగంటి రామగోపాలచార్యులు, రాజోజి సాయిరాంచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని, లోక కళ్యాణం జరుగాలనీ, దేశద్రోహులు, విదేశీ విద్రోహుల నుండి ధర్మం ధర్మపాలకులు రక్షించబడాలని, శ్రీరామ తత్వం, నామము అందరికి చేర్చడం, తద్వారా దేశానికి ధర్మానికి శ్రీరామ రక్ష కై కొనసాగుతున్న శ్రీరామ హృదయ కలశ యాత్ర కుమ్మరిపెల్లి రావడం అదృష్టమని అన్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కొడిమ్యాల శేఖర్, రవి, శేఖర్, హరీష్, మనోజ్, సాయి, అజయ్, బాలు, నరేష్, శ్రీధర్, సుమ, లావణ్య, తేజ, సుష్మ, జ్యోతి, రజిత, సుజాత, లక్ష్మి, లత భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 35 దరఖాస్తులు



సిరిసిల్ల, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి) : సిరిసిల్ల జిల్లాలో సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి 35 దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో ఇల్లంతకుంటలో 10, గంభీరావుపేటలో 4, చందుర్తి, తంగళ్లపల్లి, వేములవాడ రూరల్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు రాలేదు.ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని కార్యాలయాల్లో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల జిల్లా ప్రజలకు కలెక్టర్ దసరా శుభాకాంక్షలు



సిరిసిల్ల, అక్టోబర్ 19 (మనం ప్రతినిధి)విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, సంతోషాలు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని, ప్రజల జీవితాల్లో కష్టాలు తొలగి, శాంతి సౌభాగ్యాలు నిండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

## బొమ్మకల్ గ్రామాభివృద్ధి, బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటు

**-సర్పంచ్ వేముల శ్రీకాంత్**





**సైదాపూర్ అక్టోబర్ 19 ( మనం న్యూస్)** : సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఊర చెరువు వద్ద బతుకమ్మ తల్లి విగ్రహం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో విగ్రహ దాత వేముల వెంకటలక్ష్మి - నారాయణ వారి సారథ్యంలో విగ్రహం పెట్టే స్థలాన్ని బ్లేడ్ ట్రాక్టర్ తో చదును చేయించాము. ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మ ఆడుకునే మైదానాన్ని శుభ్రం చేయించాము. మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐమాక్స్ లైట్లు, డీజే సౌండ్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసాం, మా బొమ్మకల్ గ్రామ ఆడపడుచుల కోసం. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మా ఊర చెరువు వద్ద ఘనంగా సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించాం.ఎవరికి ఎలాంటి ఆటంకులు ఎదురు కాకుండా చూసుకున్నాం, గ్రామ అభివృద్ధే మా లక్ష్యం. ఇప్పటికే అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాము. ఇంకా ఆలయాల అభివృద్ధి, చెరువు కట్ట మరమ్మతులు, పార్క్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు ఉన్నాయి. మా గ్రామానికి మంత్రి సహకారం తో గ్రామంలో రోడ్లు కల్వర్టులు మరమ్మత్తులు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు నాయకులకు యువతి యువకులకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ గ్రామ సర్పంచ్ వేముల శ్రీకాంత్.

## చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దంపతులు



జమ్మికుంట, అక్టోబర్ 19 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలో ఉపాధి కోసం తోపుడు బండ్లు లేక ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులకు అండగా నిలుస్తూ, వారి జీవనోపాధికి తోడ్పడాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సతీమణి శ్రీమతి పాడి శాలిని రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా నిరుపేదలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఎమ్మెల్యే చేసిన కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి, శ్రీమతి పాడి శాలిని రెడ్డికి జమ్మికుంట పట్టణ ప్రజల తరఫున ధన్యవాదాలు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావిద్ అలీ, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ రావు, నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములపల్లె దుర్గా భవాని ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు

గొల్లపెల్లి అక్టోబర్ 19 (మనం న్యూస్) : గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామంలో వెలసియున్న శ్రీ శ్రీ శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న 30వ శరన్నవరాత్రుల వేడుకల్లో సోమవారం రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం శ్రీ దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. అమ్మవారి దివ్య అనుగ్రహంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రితో పాటు సర్పంచ్ సల్లూరి శోభన్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ జలేంధర్, ఉపసర్పంచ్ గడ్డం రాజేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు తాండ్ర ఆత్మచరణ్ రావ్, మాజీ సర్పంచ్ నేరెళ్ల గంగారెడ్డి, మాజీ ఎంపీపీ ఆవుల సత్యం మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోయపోతు గంగాధర్, కిషన్, మరియు వార్డు మెంబర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, మండలం దీ~ా నాయకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## నవాబుపేటలో నూతన హైమాస్ట్ లైట్ల ప్రారంభం

రామగిరి, అక్టోబర్ 19 (మనం న్యూస్): గ్రామాభివృద్ధే ధ్యేయంగా, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నవాబుపేట గ్రామ సర్పంచ్ రొద్ద మౌనిక సతీష్ కుమార్ ముందుకు సాగుతున్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆమె ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. గత పదేళ్లుగా సరైన వెలుతురు సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామస్థులకు నూతన లైట్ల ఏర్పాటుతో ఉపశమనం కలగనుంది. గ్రామంలోని వీధుల్లో వెలుతురు పెంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై గ్రామపంచాయతీ దృష్టి సారించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశయాలకు అనుగుణంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సర్పంచ్ కృషి చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో చేపడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అయిందల లావణ్య రాజ్‌కుమార్,



వార్డు సభ్యులు చెగర్ల తిరుపతి, గాజుల సుధ శ్రీనివాస్, కట్ట స్వరూప రవి, పతి దామోదర్, నవాబుపేట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అయిందల కొమురయ్య, ఉపాధ్యక్షుడు ఇమ్మడిశెట్టి సారయ్య, మాజీ ఎంపీటీసీ మద్దెల భూమయ్య, మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెగర్ల కుమార్, సీనియర్ నాయకులు మద్దెల మహేష్, బోనగిరి రాజేందర్, అయిందల రాజయ్య, పంగ అఖిలాష్, జెట్టవేని కొమురయ్య, కురతోట శంకరయ్య, మేదరి రాయలింగు, ఒలపు బాపు, మల్లోరీ రామచందర్ రెడ్డి, సింగనవేణి ఆయిలీ కుమార్, బద్రి రామచందర్, జోడు శంకరయ్య, మేదరి బనయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం



చిగురుమామిడి: అక్టోబర్ 19 (మనం న్యూస్) : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఖండ్ పరిధిలోని చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంసేవకులు సంప్రదాయ గణవేష్ ధరించి శస్త్ర పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ జిల్లా ప్రచార్ ప్రముఖ్ గీకూరి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి, శమీ పూజ నిర్వహించిన అనంతరం స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, సమాజంలో ధర్మాన్ని, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ గత 100 సంవత్సరాలుగా స్వచ్ఛందంగా దేశ సేవలో నిమగ్నమై ఉందని, వ్యక్తి నిర్మాణం ద్వారానే బలమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాజంలో యువత దేశభక్తిని పెంపొందించుకుని, సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలు లేకుండా సమాజమంతా ఏకతా భావంతో ముందుకు సాగినప్పుడే సుదృఢ భారత్ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి స్వయంసేవకుడు పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ వస్తువుల వినియోగం వంటి పంచ పరివర్తన్ సిద్ధాంతాలను తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఖండ్ కార్యవాహ ఆవుల కుమార్, మొగిలి సంపత్, మురళి, పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు, సంఘ్ పరివార్ నాయకులు పాల్గొన్నారు.

## రామగిరి ఖిల్లాకు యువత ట్రెక్కింగ్

రామగిరి, అక్టోబర్ 19(మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లా చారిత్రక ప్రాధాన్యాన్ని చాటడంతో పాటు యువతలో పర్యాటక ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో బేగంపేట గ్రామంలో 'మన జిల్లా--మన రామగిరి ఖిల్లా' కార్యక్రమంలో భాగంగా ట్రెక్కింగ్ నిర్వహించారు. మాజీ సైనికుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రామగుండం ఏసీపీ మడత రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ట్రెక్కింగ్‌లో సుమారు 200 నుంచి 250 మంది యువత, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రామగిరి ఖిల్లా వైపు సాగిన ఈ కార్యక్రమం ద్వారా చారిత్రక ప్రదేశాలపై అవగాహన పెంపొందించడంతో పాటు యువతలో శారీరక దృఢత్వం, సాహస క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, బేగంపేట సర్పంచ్ మంతెన చంటి, వార్డు సభ్యుడు మదాసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బెయేర్షెబా ప్రార్థన మందిరంలో పాస్టర్ చంద్రనీలయ్య (తిమోతి) ఆధ్వర్యంలో చీరల పంపిణీ



మెట్ పల్లి అక్టోబర్ 19 ( మనం న్యూస్) పట్టణం లోని వైయస్సా ర్ అర్బన్ కాలనీ లో గల బెయే ర్షెబా ప్రార్థన మందిరంలో సోమవారం చర్చి నిర్వాహకులు పాస్టర్ చంద్ర నీలయ్య తిమోతి ఆధ్వర్యంలో నిరుపేద వితంతు, ఒంటరి మహిళలు 20మందికిచీరలపంపిణీచేశారు.ఈకార్యక్రమంలో ఇంజనీర్ రమేష్, బచ్చు దేవిడ్ పాస్టర్, సంఘసభ్యులు తదితరులు పా ల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు



చెన్నూరు అక్టోబర్ 19 (మనం న్యూస్): చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలో శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిత్యం అన్నప్రసాద వితరణతో భక్తులకు సేవలందిస్తున్నారు. గ్రామ ప్రజలు భక్తిపారవశ్యంతో దుర్గామాతను ఆరాధిస్తూ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ

గొల్లపల్లి అక్టోబర్ 19 (మన న్యూస్) : గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, సాతల్ల లక్ష్మణ్, సిరికొండ తిరుపతి, వేల్పుల రాజేష్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ జేఏసీ చైర్మన్, జగిత్యాల జిల్లా నాయకుడు, అంబేద్కర్ అవార్డు గ్రహీత ఎనగంటి రాజేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ చేసిన సేవలను, ఆయన ఆశయాలను, ఆలోచనలను, సమాజం కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, ఆత్మగౌరవం పెంపొందించేందుకు అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు "జై భీమ్.. జై జై భీమ్" నినాదాలతో అంబేద్కర్కు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు కొండ్ర తిరుపతి,జిల్లా డిసిసి కార్యదర్శి తడగొండ విజయ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెవులమద్ది రమేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జెరిపోతుల నరేష్, చేనేత మండల ఐక్య వేదిక అధ్యక్షులు పెద్దూరి కుమారస్వామి,బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు జెరిపోతుల కొమరయ్య,చెవుల మద్ది గంగాధర్, గంగాధర అశయ్య,చెవుల మద్ది హరీష్,తదితరులు పాల్గొన్నారు.



## శాతవాహన విశ్వవిద్యాలయంలో 49 సహాయ ఆచార్యుల నియామకానికి అనుమతి

**రాష్ట్రవ్యాప్తంగా 429 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం: మంత్రి పొన్నం ప్రభాకర్**

చిగురుమామిడి అక్టోబర్ 19 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు విశ్వవిద్యాలయాల్లో మొత్తం 429 పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనుండగా, అందులో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో 49 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ 141, 142 నంబర్లతో ఉత్తర్వులు జారీ చేసిందని, సాధారణ మార్గదర్శకాలు, రోస్టర్ విధానానికి అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి ప్రకటనలు వెలువడనున్నాయని పేర్కొన్నారు.

**శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఖాళీల వివరాలు**

విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (హుస్నాబాద్) -- 36 పోస్టులు

- గణక శాస్త్ర విభాగం: 07
- కృత్రిమ మేధ విభాగం: 07
- విద్యుదయస్కాంత విభాగం: 07
- సమాచార సాంకేతిక విభాగం: 05
- విద్యుత్ విభాగం: 01
- యాంత్రిక విభాగం: 02
- ఆంగ్లం: 01
- గణిత శాస్త్రం: 02
- భౌతిక శాస్త్రం: 02
- రసాయన శాస్త్రం: 02
- వ్యాయామ విద్యా విభాగం: 01
- గ్రంథాలయాధికారి: 01

న్యాయ కళాశాల (విశ్వవిద్యాలయ ప్రాంగణం) -- 08 పోస్టులు

- న్యాయ శాస్త్రం: 08

ఔషధ శాస్త్ర కళాశాల (ఎల్ఎండీ ప్రాంగణం) -- 02 పోస్టులు

- ఔషధ శాస్త్రం: 02

వాణిజ్య, నిర్వహణ కళాశాల (విశ్వవిద్యాలయ ప్రాంగణం) -- 01 పోస్టు

- వాణిజ్య శాస్త్రం: 01

ఈ పోస్టుల భర్తీ ద్వారా ఉన్నత విద్యా రంగం మరింత బలోపేతం కావడంతో పాటు నాణ్యమైన బోధన అందుబాటులోకి వస్తుందని మంత్రి వివరించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలి



**ప్రతి కుటుంబంలో ఆనందాలు నిండాలి**

**జిల్లా ప్రజలకు ఆత్మీయ దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ అక్టోబర్ 19(మనం బ్యూరో )....విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరిసి, ప్రతి కుటుంబంలో సంతోషాలు నిండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దసరా అంటే కేవలం పండుగ మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తూ మనలో ఆశలను, ధైర్యాన్ని, నూతనోత్సాహాన్ని నింపే పర్వదినమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఎదురయ్యే కష్టాలు తొలగి, సంతోషాలు చిగురించాలని, ప్రతి కుటుంబం ప్రేమాభిమానాలతో, ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడంతో పాటు మనుషుల మధ్య ఆత్మీయతను, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ దసరా పర్వదినం ప్రజలందరిలో ఐక్యత, సోదరభావం పెంపొందించాలని, ఒకరికొకరు అండగా నిలుస్తూ ఆప్యాయతలను పంచుకోవాలని కోరుకున్నారు. జిల్లా ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి దసరా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, ప్రతి మనసులో సంతోషం, ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.